క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రూ.10 వేలు గెలుచుకున్న విద్యార్థులు

సామర్లకోట: జిల్లా స్థాయిలో దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో సామర్లకోట సిరి మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట గోపీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్ సిటీలో నిర్వహించిన పోటీల్లో 160 మంది పాల్గొనగా పాఠశాలకు చెందిన కోనూరు దుర్గ ధ్రువకుమార్, ఆకుల శ్రీనాగసంతోష్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారని తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులు విద్యార్థులకు రూ.10 వేలు బహుమతి అందజేశారన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీఐటీయూ ఆందోళన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా పట్టణ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. యూనియన్ నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. పోలవరం నిధులు గాని, విభజన చట్టం ఊసులేకుండా చేశారన్నారు. ఆదాని అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జితేంద్రకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కేదారి నాగు, గడిగట్ల సత్తిబాబు, సిరిపురపు మరిడయ్య తదితరులు పాల్గొన్నారు.

తెల్లదోమ నివారణపై చర్యలు చేపట్టాలి



రైతులకు మందులు అందజేస్తున్న ఉద్యానశాఖాధికారి సుజాత

పెద్దాపురం: పామాయిల్ రైతులు తెల్లదోమ తెగులు నివారణకు చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అన్నారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలోని రైతు గవరసాని నాగేశ్వరరావు పామాయిల్ తోటలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు తోటబడి నిర్వహించారు. రైతులు ఆయిల్ పామ్ సాగులో సమగ్ర యాజమాన్యం, సస్య రక్షణ, పోషక పద్ధతులు పాటిస్తే అధిక దిగబడులు సాధించవచ్చని సుజాత పేర్కొన్నారు. అనంతరం తెల్లదోమ నివారణపై రైతులకు అవగాహన కలిగించారు. రైతులకు పిచికారీ మందులను ఉచితంగా అందజేశారు. గవరసాని రాజశేఖర్, వాద్రేవు బాబి, హార్టికల్చర్ వీహెచ్ఏతో పాటు రైతులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిఠాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులు, అజెండాలోని అంశాలపై చర్చిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు అందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

చెరువులో మునిగి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు సూరీడు చెరువులో ప్రమాదవశాత్తూ మునిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు శుక్రవారం గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. సూరీడు చెరువులోకి శుక్రవారం సాయంత్రం ఒక వ్యక్తి దిగుతుండగా చూసిన స్థానికులు ఆ వ్యక్తి ఎంతకూ బయటకు రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై వినయ్ ప్రతాప్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించగా దానిని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షేమం తట్టుకోలేకే తప్పుడు కథనాలు



మున్సిపల్ సెంటర్‌లో ర్యాలీ చేస్తున్న దొరబాబు, అమ్మాజీ తదితరులు



పిఠాపురంలో ఈనాడుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో 'ఈనాడు' పత్రిక ప్రతుల దహనం

పెద్దాపురం: సీఎం జగన్ ప్రజలు చేస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ఈనాడు పత్రిక తప్పుడు కథనాలు ప్రచురిస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ అన్నారు. పట్టాభిని కొట్టారంటూ రెండేళ్ల నాటి ఫొటోలు ప్రచురించడంపై శుక్రవారం సాయంత్రం పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్లు బొద్దు తులసీ మంగతాయారు, గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జాని, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘురావు, పార్టీ నాయకులతో కలసి ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. దవులూరి, అమ్మాజీ మాట్లాడుతూ పేదలకు, వెనకబడిన జాతుల గౌరవం పెంచేలా విప్లవాత్మక నిర్ణయాలతో జనం గుండెల్లో చోటు సంపాదించుకున్న సీఎం జగన్ అన్నారు. గతంలో కొన్ని ప్రభుత్వాలను కూల్చేందుకు ఈ పత్రికను ఎలా వాడుకున్నారో, ఇప్పుడు అదే పత్రికను వాడుకుని ప్రభుత్వంపై బురదజల్లుతున్నారన్నారు. 'ప్రజలను ఒప్పించు.. లేకపోతే కన్ఫ్యూజ్ చేయి' అనే పంథాలో ప్రతిపక్ష పార్టీ నడుస్తోందన్నారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ ప్రజల మన్నన పొందలేక ప్రతి పక్షపార్టీ 'ఈనాడు'లో అసత్య వార్తలు రాయిస్తూ ప్రభుత్వంపై విషం కక్కుతోందన్నారు. అనంతరం ఈనాడు ప్రతులను దహనం చేశారు. కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘువులు, వాసంశెట్టి గంగ, పప్పల దుర్గారావు, ఏలేటి అనంతలక్ష్మి తదితరులతో పాటు సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఈనాడు ప్రతుల దహనం

పిఠాపురం: పత్రికా విలువలను తుంగలోకి తొక్కి కుల పిచ్చితో చంద్రబాబుకు దాసోహం చేస్తూ ప్రజలను మభ్య పెట్టడం ప్రారంభించిన రోజే ఈనాడు పత్రిక పతనం ప్రారంభమైందని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. టీడీపీ నేత పట్టాభిని కొట్టారంటూ ఈనాడు ప్రచురించిన తప్పుడు కథనాలకు నిరసనగా శుక్రవారం పిఠాపురంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ నిజాలను దాచి పెట్టి అబద్ధాలను ప్రచురిస్తూ పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న ఈనాడు అధినేత రామోజీరావు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టాభిని కొట్టినట్లుగా పాత ఫొటోలతో కథనం ప్రచురించి ప్రజల్లో టీడీపీ పట్ల సానుభూతిని తీసుకురావాలని ఈనాడు చేసిన కుట్రను వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా బట్టబయలు చేయడంతో రామోజీరావుకు సిగ్గుతో తల దించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిరోజూ ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న రామోజీరావు పత్రికా విలువలను టీడీపీకి తాకట్టు పెట్టారన్నారు. అనంతరం ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, మొగలి బాబ్జి, కారే శ్రీనివాసరావు, జ్యోతుల భీముడు, బొజ్జా రామయ్య, అరిగెల రామయ్యదొర, ఆనాల సుదర్శన్, పచ్చిమళ్ల అప్పలరాజు, వడ్రపు వీరేష్, బోను దేవ, మొలి అయ్యారావు, జవ్వాది నాయుడు, కొత్తపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురం: ప్రభుత్వంపై బురదజల్లడం కోసం తప్పుడు కథనాలు, వార్తలు ప్రచురిస్తున్న ఈనాడు రామోజీరావు ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ప్రజలు రామోజీరావును ఛీకొడుతున్నా సిగ్గు లేకుండా కుల పిచ్చితో టీడీపీ, చంద్రబాబుకు కొమ్ము కాస్తూ ప్రజలను మభ్యపెట్టేలా తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పట్టాభి ఒక ఉన్మాదిగా ప్రవర్తించి పోలీసులపై దౌర్జన్యానికి దిగితే దానిని వక్రీకరించి పట్టాభికి వంత పాడుతూ ఈనాడు పాత ఫొటోలతో కథనాలు రాయడాన్ని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా బట్టబయలు చేసిందన్నారు. దాంతో మొహం ఎక్కడ పెట్టుకోవాలో తెలియక సాంకేతిక సమస్య అంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడం రామోజీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. తప్పు చేసినప్పుడు తప్పించుకోవడం మంచిది కాదని, చేసిన తప్పుకు క్షమాపణ చెప్పడం నైతికత అని ఎమ్మెల్యే అన్నారు. తమ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమాన్ని చూసి ఓర్వలేక తప్పుడు కథనాలు ప్రచురిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని రామోజీరావు వేస్తున్న ఎత్తుగడలు ఇక చెల్లవన్నారు. ప్రజలకు రామోజీరావు అసలు రూపం తెలిసిపోయిందని, ఇక తప్పుడు వార్తలు రాస్తే జనం చూస్తూ ఊరుకోరన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని అసలు నిజాలను ప్రజలకు తెలియజేయాలని రామోజీరావుకు హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా సంక్షేమ పాలనను అడ్డుకోవాలని చూస్తే రామోజీరావుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మత్స్యకారుల ఆందోళన

కొత్తపల్లి: మత్స్యకారులు జీవనం సాగించే సాగర తీర ప్రాంతంలో కాలుష్య కారక పరిశ్రమలను అనుమతించబోమని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ఉప్పాడ తీర ప్రాంతంలో శుక్రవారం ఫిషింగ్ హార్బర్ యూనియన్ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామాల నాయకులు సమావేశం నిర్వహించారు. తొండంగి మండలంలో నిర్మించనున్న బల్క్ డ్రగ్ పరిశ్రమను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉప్పాడ, అమీనాబాదు, మూలపేట, కోనపాపపేట గ్రామాలకు చెందిన మత్స్యకార నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే టీచింగ్ అసోసియేషన్ కార్యవర్గం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్, కార్యదర్శిగా ఎం.స్వరూపారాణి, సంయుక్త కార్యదర్శిగా శ్యామ్‌కుమార్, కోశాధికారిగా డి.హరిత, కార్యవర్గ సభ్యులుగా బి.కృష్ణారావు, ఇ.సునీత, మధుప్రసాద్, డాక్టర్ కె.దుర్గా గంగారావు, మహిళా ప్రతినిధిగా ఝాన్సీరాణి ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత అభినందించారు.

కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు



కుట్టు శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న గండేపల్లి బాబీ తదితరులు

పిఠాపురం: పట్టణంలోని జగ్గయ్య చెరువు కాలనీలో మహిళలకు స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్, సీఎస్ఆర్ ప్రాజెక్టు ద్వారా మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ సౌజన్యంతో ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహక కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడటానికి స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్, సీఎస్ఆర్ ప్రాజెక్టు ద్వారా మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు, స్పందన బ్రాంచి మేనేజర్ సాయి కుమార్, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కాకినాడ: 27, 28 తేదీల్లో నగరంలోని 10 ప్రాంతాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ (ఎఫ్ఏసీ) సీహెచ్ నాగ నరసింహారావు తెలిపారు. ఆధార్‌లోని డాక్యుమెంట్ అప్డేట్, మార్పులు, చేర్పుల కోసం సోమవారం, మంగళవారాల్లో ఈ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత ప్రజలందరూ తమ ఆధార్‌లో ఉన్న ఈస్ట్ గోదావరి అని ఉన్న జిల్లాను కాకినాడ జిల్లాగా తప్పనిసరిగా మార్చుకునేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిజేశారు. కాకినాడ అర్బన్‌లో కృష్ణనగర్- 2ఏ, డైరీఫారం-11ఏ, గోలీలపేట-14ఏ, యానాంరోడ్డు-15ఏ, చిన్నమార్కెట్-21ఏ, యాళ్లవారి స్ట్రీట్- 28బి, జగన్నాయక్‌పూర్-30 బి, బ్యాంక్‌పేట-32ఏ, గాంధీనగర్ -38ఏ, గైగోలుపాడు-50బి సచివాలయాలలో ఆధార్ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

రీ సర్వే వేగవంతం చేయండి

ఇన్‌చార్జి కమిషనర్ నాగ నరసింహారావు



కాకినాడ: భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో శుక్రవారం అడ్మిన్ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సీడీఎంఏ నుంచి 16ఏ ఫార్మేట్‌లో వచ్చిన ఆదేశాల ప్రకారం ఆయా అసెస్‌మెంట్ నెంబర్లు, ఇతర సమాచారాన్ని సర్వే నెంబర్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఆయా సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

గేటు పడితే గందరగోళమే

- మాధవపట్నంలో వాహన చోదకులకు ఇక్కట్లు
- శుక్రవారం రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్
- ఉద్యోగులు, విద్యార్థులకు నిత్యం ఇదే సమస్య
- అతిక్రమణలు, ఆక్రమణలతో పరిస్థితి తీవ్రం



కాకినాడ రోడ్డులో మాధవపట్నం వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో మాధవపట్నం వద్ద ఉదయం సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ సమస్యను గుర్తించి ఇంద్రపాలెం పోలీసులు స్థానిక ఆటో యూనియన్ నాయకులు సహాయంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. నిత్యం ఇదే సమస్య ఎదురవుతూ స్థానికులు, వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ నిర్మాణమే మార్గంగా కనిపిస్తున్నప్పటికీ సమీప కాలంలో ఆ దిశగా ప్రయత్నాలు సాగడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు అడపాదడపా ఆ ప్రస్తావన తెస్తున్నా కార్యరూపం దాల్చడానికి ఏళ్లు పట్టేలా ఉంది. ఉదయం వివిధ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యా సంస్థల బస్సులతో సామర్లకోట–కాకినాడ రోడ్డు రద్దీగా ఉంటుంది. ఇదే తరుణంలో మాధవపట్నంలోని రైల్వే గేటు వేసి తీసిన సమయంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. సర్పవరం జంక్షన్‌కు రైల్వే గేటు మీదగానే వాహనాల రాకపోకలు ఉంటాయి. రైల్వే గేటు ఇరుకుగా ఉండడంతో పాటు మాధవపట్నం రైల్వే గేటు రోడ్డు మార్జిన్‌లో దుకాణాలు పెరిగి పోవడంతో ట్రాఫిక్ సమస్య నిత్యం తలెత్తుతోంది. రైల్వే గేటు సమీపంలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రి ఉండటంతో ఆస్పత్రికి వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపై నిలిపివేస్తుంటారు. ఈ పరిస్థితి వల్ల కూడా రోడ్డు ఇరుకైపోతోంది. కాకినాడ రోడ్డు నుంచి మాధవపట్నం రైల్వే గేటు రోడ్డు విస్తరణకు నోచుకోక పోవడం, వాహనాల రద్దీ రోజురోజుకూ పెరిగిపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. మాధవపట్నం పాలక మండలి మాధవపట్నం–కాకినాడ రోడ్డు మార్జిన్‌లో ఉన్న షాపులను, చెట్లను తొలగించి రోడ్డు వెడల్పు చేసినా ఫలితం లేకపోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే గేటు రోడ్డులో ఆక్రమణలు తొలగించడం ద్వారా మాత్రమే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమని సర్వత్రా సూచనలు వినిపిస్తున్నాయి. గేటు పడి తీసే సమయంలో నిత్యం ట్రాఫిక్‌లో చిక్కుకుని తమ కార్యాలయాలకు వెళ్లలేకపోతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న చిన్న వాహనచోదకులు మరింత ఇబ్బంది పడుతున్నారు.

సాగునీరు అందించాలి

- అధికారులను కోరిన రైతులు
- శిథిలమైన చెక్ డ్యాంను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్



వీకే రాయపురంలోని శిథిలమైన చెక్ డ్యాంను పరిశీలించిన అధికారులు, రైతు సంఘ నాయకులు

సామర్లకోట: దాళ్వా సీజన్‌లో రైతుల పంట పొలాలకు సాగునీరు అందేలా చూడాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం వీకే రాయపురంలో శిథిలమైన చెక్ డ్యాంను తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఇరిగేషన్ ఏఈ నాగేశ్వరరావు పరిశీలించారు. 'సాక్షి'లో గురువారం 'శిథిలమైన చెక్‌డ్యాంలతో సాగునీరు వృథా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టరు కృతికా శుక్లా ఆదేశాల మేరకు చెక్ డ్యాంను పరిశీలించారు. ఎనిమిదేళ్లుగా ఈ చెక్ డ్యామ్ నుంచి పల్లపు ప్రాంతాల్లోకి నీరు వృథాగా పోతోందని రైతులు అధికారులకు వివరించారు. ఇప్పటికే ఎగువ ప్రాంత భూములు బీటలు వేశాయని, ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులు పరిశీలించారని తెలిపారు. చెక్ డ్యాం నిర్మాణంతోనే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. గోదావరి నీరు నిలిపివేసిన తరువాత వేసవిలో మాత్రమే పనులు ప్రారంభించాల్సి ఉందని ఏఈ నాగేశ్వరరావు తహసీల్దార్‌కు తెలిపారు. ప్రస్తుతం రైతులకు సాగునీరు అందేలా ఏలేరు కాలువలో మోటార్లు వేయాలని రైతులు డిమాండ్ చేశారు. పంట కాలువలకు నీరు వచ్చేలా మూడు మోటార్ల ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇచ్చారు. మోటార్లకు అయ్యే ఇంధనం వ్యయాన్ని ఇరిగేషన్ శాఖ భరిస్తుందని హామీ ఇచ్చారు. చెక్ డ్యాం విషయం కలెక్టరు దృష్టిలో ఉంచి సమస్యను పరిష్కరిస్తామని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రైతు సంఘ అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసు, రైతు సంఘ నాయకులు తలారి దొరబాబు, వెలమర్తి శ్రీనివాసు, ఇంటి వెంకట్రావు, బదిరెడ్డి వీరభద్రరావు, ఇమ్మిడిశెట్టి సూర్యనారాయణ, కుర్రా చంటిబాబు, గొలపల్లి నానాజీ, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెలమర్తి బుల్లిరాజు, పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి, వీఆర్వో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



అమీనాబాదులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు ప్రధాన రహదారిలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. పలు చోట్ల ఎస్, ఎల్ ఆకారంలో మలుపులు ఉండడంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు ఈ రహదారిలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థానికులు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆక్రమణలతో మలుపులు మరింత ప్రమాదకరంగా మారాయి. ఆక్రమణల వల్ల ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఈ మలుపుల్లో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి మలుపుల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వెనుకబడిన సంక్షేమం



వసతిగృహం పరిసరాలు పరిశీలిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి తదితరులు

- వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా జడ్జి
- ఉద్యోగులపై అసహనం
- కోర్టుకు రావాలని ఆదేశం

కాకినాడ లీగల్: స్థానిక జగన్నాథపురంలోని పాఠశాల, కళాశాల మహిళల బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులను మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాల్లో విద్యార్థినులకు, అందుతున్న వసతులు, సదపాయాలను పరిశీలించి అసహసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని సమస్యలు, వసతులను జిల్లా జడ్జికి విద్యార్థులు వివరించారు. వసతిగృహం శ్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయని, లైటింగ్ లేదని, బియ్యం వాసన వస్తున్నాయని, ప్రహరీ సరిగా లేకపోవడంతో తమ పట్ల పలువురు అసభ్యంగా మాట్లాడుతున్నారని వివరించారు. అలాగే మరుగుదొడ్లకు తలుపులు లేవని, చిన్న గదుల్లోనే ఎక్కువ మంది సర్దుకుని గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను సంబంధిత వసతి, కళాశాల వార్డెన్లకు వివరించారా అని న్యాయమూర్తి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన కోర్టు వద్దకు రావాలని ఉద్యోగులకు ఆదేశించారు. కళాశాల వసతి గృహ వార్డెన్ సరస్వతి, పాఠశాల గరల్స్ హాస్టల్ వార్డెన్ ఫ్లోరెన్స్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసాద్, వన్‌టౌన్ పోలీసు, మండల న్యాయసేవాధికార సంస్థ ఉద్యోగి సంధ్య పాల్గొన్నారు.

సమాజ చరిత్రకు ప్రతిబింబం సాహిత్యం

- నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ అశోక్
- వలసవాదానంతర సాహిత్యంపై ఏఎస్‌డీలో జాతీయ సదస్సు

కాకినాడ సిటీ: జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో వలస వాదానంతర భారత సాహిత్య పాత్రలపై రెండు రోజుల జాతీయ సదస్సును నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ టి.అశోక్ ప్రారంభించారు. సమాజంలోని వివిధ అంశాలను సాహిత్యం ప్రతిబింబిస్తుందని, దాని ద్వారా సమాజ చరిత్రను తెలుసుకోవచ్చన్నారు. సాహిత్యంలోని పాత్రలు, కల్పితమైన కథాంశాలు, సామాజిక అంశాలు, సమకాలీన సమాజాన్ని అనుసరిస్తూనే ఉంటాయని అశోక్ అన్నారు. ఆంగ్ల సాహిత్యంలో వలస వాదానంతరం వెలువడిన కథలు, నవలలు మొదలైనవి మానవీయతను వెలికితీస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వి అనంతలక్ష్మి కళాశాల ప్రగతిని వివరించారు. ఈ జాతీయ సదస్సు తమ కళాశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ విశ్రాంత ఆచార్యుడు టి.విశ్వనాథరావు మాట్లాడుతూ వలస వాదానంతరం సాహిత్యం–సమాజంపై వలస పాలనకు ముందున్న సంస్కృతిని, సాహిత్యాన్ని వివరించారు. సదస్సు కన్వీనర్ పి.సంజోత, వివిధ శాఖల అధ్యాపకులు పి.విశ్వనాథరావు, టీకేవీ శ్రీనివాసరావు, సువర్చల, పి.శాంతి, వై.స్వర్ణశ్రీ, ఎం.వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం సీడబ్ల్యూసీ సభ్యుడిగా సత్యనారాయణ

కాకినాడ: అఖిల భారత పద్మశాలీ సంఘ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా కాకినాడకు చెందిన పొన్నగంటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ అఖిల భారత అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామక ఉత్తర్వులు పంపారని కోస్తా ఆంధ్రా సంఘ అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

బాణకవి గ్రంథావిష్కరణ

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీ కన్వెన్షన్‌లో బాణకవి పుస్తకావిష్కరణ శుక్రవారం నిర్వహించారు. 1958లో తట్టా రంగరామానుజాచార్యులు బాణకవి చరిత్రను గ్రంథంగా రచించి, ప్రచురింపజేశారు. రంగరామానుజాచార్యులు శత జయంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు ఈ గ్రంథాన్ని పునర్ముద్రించారు. పుస్తకావిష్కరణ సభకు డాక్టర్ పుట్టా లక్ష్మీ నరసింహాచార్యులు అధ్యక్షత వహించగా గుదిమెళ్ల లక్ష్మీ నరసింహాచార్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని రంగరామానుజాచార్యులు బహుముఖ ప్రజ్ఞను కొనియాడారు. గ్రంథకర్త కుమారులు నలుగురు, కుమార్తెలు ఇద్దరు, మనుమలు 16మంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ఆందోళన

కాకినాడ సిటీ: కేంద్ర బడ్జెట్ సంక్షేమ రంగాలకు కోత విధించడం, అదానీ అవినీతి పెద్ద ఎత్తున బయటపడినా ప్రభుత్వ పెద్దలు వంతపాడడం పట్ల సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం కాకినాడ మెయిన్‌రోడ్డులోని హెడ్ పోస్టాఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. బడ్జెట్‌లో వ్యవసాయం, ఉపాధి హామీ, స్త్రీ శిశుసంక్షేమం, ఆహారభద్రత, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం వంటి రంగాలకు భారీ కోత విధించడం దారుణమన్నారు.